## క్లుప్తంగా

### నవోదయ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బొండపల్లి: నవోదయ ప్రవేశ పరీక్షలకు సంబంధించి మోడల్ టాలెంట్ టెస్టును బోడసింగి పేట గ్రామంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టుకు నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలోని గ్రామాల నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారని స్కూల్ కరస్పాండెంట్ పి.శ్రీనివాసరాజు(శివాజీ) తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

### ప్రభుత్వ భవనాల ప్రారంభం రేపు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జమ్ము సచివాలయ భవనం

గుర్ల: మండలంలోని జమ్ము గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఈనెల25న రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారని ఎంపీడీఓ కల్యాణి, జమ్ము సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజరై, భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండల అధికారులు అంతా హాజరుకావాలని కోరారు.

### గాంధీజీ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ఆదినారాయణ దంపతులు, ఉపాధ్యాయ సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కొండపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని దాతలు ఆదివారం ఆవిష్కరించారు. చీపురుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జమ్ము ఆదినారాయణ,రాజేశ్వరి దంపతులు తమ కుమారుడు బాలాజీనాయుడు జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### నవధాన్యాల కిట్‌లు పంపిణీ



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న సభల సంస్థ ప్రతినిధి

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామంలో సభల సంస్థ ప్రతినిధి కోటిబాబు ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో రైతు లకు నవధాన్యాల కిట్‌లు ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### పాదరక్షల పంపిణీ



గిరిజనులకు పాదరక్షలు అందజేస్తున్న సత్యసాయిసేవా సమితి సభ్యులు

శృంగవరపుకోట: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎస్.కోటకు చెందిన సత్య సాయిసేవా సమితి సభ్యులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన గ్రామం మూల బొడ్డవర, కొత్తమరుపల్లి, లచ్చందొరపాలెం గ్రామాలకు చెందిన 100 మంది గిరిజనులకు పాదరక్షలు పంపిణీ చేశారు. అలాగే మూలబొడ్డవరలో ముగ్గు రు గర్భిణులకు సీమంతం చేశారు. డాక్టర్ ఆర్.త్రినాథరావుతో పాటు పలువురు సత్యసాయి భక్తులు హాజరయ్యారు.

### విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కొత్తవలస: మండల కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీ సమీపంలోని మిండి లేఅవుట్‌లో కె.రామకృష్ణకు చెందిన ఇంటిలో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంటిలోని ఫర్నీచర్, వంటగదిలో సామగ్రికి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడవంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.50 వేల విలువైన సామగ్రి కాలిపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

# ఇంటింటికీ సంక్షేమ పథకాలు



నీలకంఠాపురంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రేగ సచివాలయం పరిధిలోని రేగ, నీలకంఠాపురం గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని చెప్పారు. ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనుల కోసం ప్రతీ సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లిమాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, సర్పంచ్ రావాడ నీలకంఠం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి యడ్ల కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంగ రమణ, ఆవాల సత్యనారాయణ, శీర తాతబాబు, భూమిరెడ్డి స్వామినాయుడు, బంగారు నాగేశ్, గోకేడ మసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో విజ్ఞానం



గరివిడి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

చీపురుపల్లిరూరల్(గరివిడి): పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందని రిటైర్డ్ టీచర్ కె.పాపారావు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గరివిడి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అలాగే పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కథలు చెప్పించారు.

### చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్‌యూత్ సభ్యులు

జామి: స్థానిక బస్టాండ్‌లో వాసవీక్లబ్ యూత్ సభ్యులు ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని వారు తెలిపారు. వాసవి క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

## ఆకట్టుకున్న గుర్రాలు, ఎడ్ల పరుగు ప్రదర్శన



వేపాడ: పెదగుడిపాలలో దౌడు తీస్తున్న గుర్రం



వేపాడ: దబ్బిరాజుపేటలో ఎడ్ల పరుగు ప్రదర్శన



వేపాడ: గుర్రాల పరుగు ప్రదర్శనలో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ కస్తూరి

వేపాడ: మండలంలోని పెదగుడిపాల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన, దబ్బిరాజుపేట గ్రామదేవత దుర్గాలమ్మతల్లి పండగ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గుర్రాల పరుగు ప్రదర్శనలో అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన పది గుర్రాలు పాల్గొన్నాయి. రామన్నపాలెంకు చెందిన బోడమాంబ విక్రంగుర్రం విజేతగా నిలిచింది. వరుసగా ఆరుస్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరీ, గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు. దబ్బిరాజుపేటలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన 20 జతల ఎడ్లు పాల్గొన్నాయి. కలగాడకు చెందిన కొలపర్తి రామునాయుడు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.20వేలు నగదు బహుమతి కైవసం చేసుకున్నాయి. మొదటి 10 స్థానాల్లో నిలిచినఎడ్లకు సంబంధించిన యజమానులకు గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతి అందజేశారు.

# సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



వేపాడ: బొర్రవలసలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు తదితరులు



గుర్ల: కెల్లలో పథకాలను వివరిస్తున్న నాయకులు



బొండపల్లి: గొట్లాంలో పథకాలపై సర్వే చేస్తున్న నాయకుడుతులసీరాం,వైస్ ఎంపీపీ సరోజిని, పీఏసీఎస్ చైర్మన్ రమణ

గుర్ల: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సూర్యనారాయణ, కెల్ల సురేష్ కోరారు. మండలంలోని కెల్ల గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరించారు. అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. వైస్ సర్పంచ్ కొంచాడ ఈశ్వరరావు, గృహసారథులు పాల్గొన్నారు.

**ఇంటింటికీ జగనన్న సైన్యం**

బొండపల్లి: మండల వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గొట్లాంలో స వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు తులసీరాం ,వైస్ ఎంపీపీ సరోజిని, పీఏసీఎస్ చైర్మన్ రమణ పథకాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించి, ప్రజా మద్దతు పుస్తకాల్లో నమోదు చేశారు.

**విశేష స్పందన**

వేపాడ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. వీలుపర్తి పంచాయతీ బొర్రవలసలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోకేడ సత్యంనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ బోజంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

గజపతినగరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంరాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజల హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తోందని, ప్రధాని మోదీని ప్రజలంతా కలిసి ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పురిటిపెంట ఎన్జీఓ హోమ్‌లో సీపీఎం,సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రచార బేరి సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, కార్పొరేట్ వ్యక్తులకు ప్రజా సంపదను కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా వారికి అమ్మి పెడుతున్నారని, ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసే చర్యలకు పాల్పడుతుండడం బాధాకరమని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను రోజు పెంచుకుంటూ పోతోందని మండిపడ్డారు.సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, గజపతినగరం,మెంటాడ మండలాల నాయకులు గేదెల రామునాయుడు,రాకోటి రాములు,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్, నూకరాజు,రాము,గురువుల పాల్గొన్నారు.

### 28న ప్రజావేదిక

దత్తిరాజేరు: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఇదివరకు సోషల్ ఆడిట్ పూర్తయ్యింది. ఈనివేదికలపై ఈనెల 28న స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ సత్యవతి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి వేతన దారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరై తమ అభ్యంతరాలు తెలియచేయడం లేదా, సూచనలు,సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

### నేడు ఒంపల్లిలో ఆర్బీకే ప్రారంభం

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)ను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నారని ఎంపీపీ చల్లా చలం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్బీకే ప్రారంభం అనంతరం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

### బెవరపేటలో పోలీస్ పికెటింగ్

చీపురుపల్లి రూరల్: మండలంలోని పి.కె.పాలవలస పంచాయతీ బెవరపేట గ్రామంలో శనివారం రాత్రి కొట్లాట జరిగిన నేపథ్యంలో ఆదివారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని చీపురుపల్లి సీఐ సంజీవరావు తెలిపారు. కొట్లాట తర్వాత మళ్లీ గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పికెటింగ్ ఏర్పాటు చేశామని వివరించారు.

### నిరసన

జామి: మండలంలోని యాతచిల్లపాలెం, యాతపాలెంను ఆనుకుని ఉన్న కొండ గ్రావెల్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు తరలించవద్దంటూ యాతపాలెం గ్రామస్తులు కొండ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెలు, మేకలు,పశువుల మేతకు ఈ కొండే ఆధారమని, గ్రావెల్ తవ్వకాలతో కొండస్వరూపమే మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ కూడా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారని గతంలో అనేకసార్లు అధికారులుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారని, అయితే పంచాయతీకి ఎలాంటి అనుమతి పత్రాలు సమర్పించలేదని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ హేమంత్‌కుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని చెప్పారు.

### పైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్ రజతోత్సవం



అన్నమాచార్య కీర్తనాలపన చేస్తున్న ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీ పైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘ రజతోత్సవ కార్యక్రమాలు సంఘ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మిమ్స్ అర్బన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సాయంత్రం క్లబ్ ఆవరణలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు సారథ్యంలో జరిగిన గీతాలాపన ఆకట్టుకుంది. రాత్రి నిర్వహించిన సభా కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు తామెప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ భేరి రాధికారాణి, వైవీవీ సత్యరనారాయణ, మానాప్రగడ సాహితి, దేవరాజు గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కాలువ కప్పేస్తున్నారు..!

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలో కోమటి చెరువు నుంచి పొలాలకు సాగునీరు అందే కాలువను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన స్వార్థ కోసం కప్పేస్తున్నాడని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రవిరామకృష్ణ, కిట్టుబాటు తదితరులు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాలువ కప్పేస్తే ఆయకట్టు భూములకు సాగునీరు పూర్తిగా అందదని అన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే ఈనెల 3వ తేదీన స్పందనలో తహసీల్దార్, వీఆర్‌ఓ, గ్రామసర్పంచ్, ఇరిగేషన్ డీఈ, పోలీస్‌శాఖల అధికారులు అందరికీ తెలియజేశామని చెప్పారు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదని, సదరు ఆక్రమణదారు యథేచ్ఛగా ఆదివారం మళ్లీ మట్టివేసి కాలువ కప్పేసేందుకు సిద్ధం అయ్యారని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధి కారులు చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పంట కాలువను పూడ్చేస్తున్న దృశ్యం

## ఆలయాల్లో అక్షయ తృతీయ పూజలు



వేపాడలో పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి



దేవుపల్లిలో మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి



గజపతినగరంలోని రామాలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

గజపతినగరం/ వేపాడ/ బొండపల్లి: అక్షయ తృతీయ సందర్భంగా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజపతినగరం రామాలయంలో వేంకటేశ్వరస్వామిని అర్చకులు శ్రీనివాసాచార్యులు నరసింహస్వామిగా అలంకరించి భక్తులతో పూజలు,అభిషేకాలు చేయించారు. వేపాడలోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఎస్.కోటకు చెందిన తులసి దంపతులు అందజేసిన పట్టువస్త్రాలను ఆలయ ధర్మకర్త రావర్తి ప్రసాద్ స్వామి వారు, అమ్మవార్లకు అలంకరించారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ భక్తులతో పూజలు చేయించారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు సహాయం



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు రమణమూర్తి



బాధిత కుటుంబాలకు బియ్యం, ఇతర సామగ్రి అందిస్తున్న ఆంధ్రబాప్టిస్టు చర్చి నిర్వాహకులు

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలకు ఉత్తరాంధ్ర విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి తమ వంతు సహాయం చేశారు. బాధితులను ఆది వారం ఆయన పరామర్శించారు. వారికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతంతో కలిసి అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి వెంకటరమణ, గేదెల సత్యనారాయణ,ముల్లు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఆంధ్ర బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో..**

పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం ప్యాకెట్లు,బిందెలు, బకెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ,పాస్టర్ విజయ్‌కుమార్, రెవరెండ్ పాస్టర్ ధర్మారావు, ఎంపీటీసీ దాలయ్య, చిట్టిబాబు మాస్టర్, ఏవీఆర్ డి.ప్రసాద్, విజయ్,చైతన్య తదితరులు పాల్గొన్నారు.